క్లుప్తంగా

పోలమాంబను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే


అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి దంపతులు, ఎంపీపీ లక్ష్మి

బొబ్బిలి: పార్వతీపురం మన్యం జిల్లా, మక్కువ మండలంలోని శంబర గ్రామంలో కొలువైన పోలమాంబ అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పల నాయుడు మంగళవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించేలా ఆశీర్వదించాలని ఆయన వేడుకున్నారు. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, బొబ్బిలి ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడులు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.

శతశాతం పన్నులు వసూలు కావాలి


పన్నుల వసూళ్లలో సిబ్బందితో కలిసి మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: ఇంటి పన్నుతో పాటు కుళాయి, ఇతర పన్నుల వసూళ్లు శతశాతం చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సూచించారు. స్థానిక పట్టణంలో మున్సిపల్ సిబ్బంది చేపడుతున్న పన్నుల వసూళ్లను ఆమె మంగళవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. ప్రతీ ఇంటికి వెళ్లి పన్నులు వసూలు చేయాలని, పన్ను చెల్లించని వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పాలన్నారు.

బీసీ సంఘం ఉత్తరాంధ్ర లీగల్ కన్వీనర్‌గా గంగాధర్


నియామకపత్రం అందుకుంటున్న గంగాధర్

బొబ్బిలి: బీసీ సంఘం ఉత్తరాంధ్ర లీగల్ కన్వీనర్‌గా బొబ్బిలికి చెందిన తుమరాడ గంగాధర్ నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడలో మంగళవారం జరిగిన సమావేశంలో బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు చేతులమీదుగా ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ మేరకు ఆయనకు పలువురు బీసీ సంఘం నేతలు అభినందనలు తెలిపారు.

వేతనదారులందరికీ పనులు కల్పించండి


మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

బాడంగి: వేతనదారులందరికీ ఉపాధి హామీ పథకం పనులు కల్పించండి అని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పథకం సిబ్బందితో మంగళవారం సమావేశమైన ఆయన పలు సూచనలు చేశారు. ప్రస్తుతం జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా లక్ష వరకు పనిదినాలు కల్పించాల్సిన ఉన్నందున వేతనదారులందరినీ పనుల్లోకి తీసుకోవాలన్నారు. అలాగే పల్లె పండగ పనులు, గోశాలల నిర్మాణం ఈ నెలాఖరులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు



వైద్యసేవలపై ఆరాతీస్తున్న బృంద సభ్యులు

రేగిడి: మండలంలోని అంబాడ వెంకటాపురం ఆయుష్ కేంద్రాన్ని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం మంగళవారం సందర్శించింది. సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ, ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీశారు. ముఖ్యంగా గర్భిణులు, విద్యార్థుల ఆరోగ్య తనిఖీలు, వారికి అందిస్తున్న మందులు, వైద్య సలహాలపై వివరాలు సేకరించారు. అలాగే ఆర్‌సీహెచ్ సేవలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రం నిర్వహణ బాగుండడంతో బృంద సభ్యులు సంతృప్తి వ్యక్తం చేసి, సిబ్బంది పనితీరును అభినందించారు. కార్యక్రమంలో డీపీహెచ్ఎన్‌వో సత్యవతి, గణాంకాధికారి ధర్మారావు, డీపీవో రామానుజులనాయుడు, బూరాడ పీహెచ్‌సీ ఈవో రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- కలుషితం కానున్న చెరువు నీరు
- సారధి గెడ్డ ద్వారా రాజాం మురుగునీరు తరలింపు
- రాజాం నుంచి భారీ సీసీ డ్రెయిన్ నిర్మాణం
- కాలుష్యం కోరల్లో 599 ఎకరాల చెరువు
- ఆయకట్టులోని వేలాది ఎకరాల పొలాలకు నష్టం
- ఆందోళనలో రైతాంగం


సిరిపురం తామర చెరువు

ప్రమాదం అంచున.. సిరిపురం తామర చెరువు!


సారధి గెడ్డలోకి అనుసంధానం చేసిన మురుగు కాలువ

రాజాం:

పట్టణ మురుగునీటిని సారధి గెడ్డ ద్వారా సంతకవిటి మండలంలోని సిరిపురం గ్రామ తామర చెరువుకు తరలించేందుకు చర్యలు ఊపందుకున్నాయి. ఇప్పటికే గెడ్డను కలుపుతూ రూ.11 లక్షల వ్యయంతో భారీ సీసీ డ్రెయిన్(ప్రధాన కాలువ) నిర్మాణం చేపట్టారు. ఠాణావీధి, మాధవబజారు, శ్రీనివాస రోడ్డు, లచ్చయ్యపేట, సాయినగర్ తదితర వార్డుల్లోని మురుగుకాలువలను ఈ ప్రధాన కాలువకు అనుసంధానించారు. ఇదే కాలువలోకి మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు చెత్తాచెదారం నేరుగా సారధి గెడ్డలోకి చేరనున్నాయి. అయితే రాజాం మండలంలోని మారేడుబాక గ్రామం వద్ద ఉన్న ఈ సారధి గెడ్డ ద్వారానే సారధి, అంతకాపల్లి, వీఆర్‌అగ్రహారం, సంతకవిటి మండలంలోని మండాకురిటి గ్రామం మీదుగా సిరిపురం తామర చెరువులోకి ఆ మురుగు అంతా వచ్చి కలవనుంది. దీంతో గెడ్డ ఆయకట్టు పరిధిలోని వీఆర్‌అగ్రహారం, మండాకురిటి గ్రామాల్లోని 850 ఎకరాలు, సిరిపురం తామర చెరువు ఆయకట్టు పరిధిలోని వేలాది ఎకరాల పంటపొలాలకు వెళ్లే సాగునీరు కలుషితం కానుంది. తద్వారా పంటలు పాడయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో బాధిత రైతులంతా లబోదిబోమంటున్నారు. చెరువు కలుషితం కాకుండా చూడాలని అభ్యర్థిస్తున్నారు.

మురుగునీటి శుద్ధి ప్లాంట్లు లేకనే..

గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాజాం మున్సిపాలిటీకి కేంద్ర ప్రభుత్వం ద్వారా మూడు మురుగునీటి శుద్ధి ప్లాంట్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంది. వాటి ఏర్పాటు కోసం పట్టణ శివారులోని ప్రభుత్వ భూమిని సేకరించాలని అప్పట్లో పర్యావరణ శాఖ అధికారులను ఆదేశించింది. గాయత్రి కాలనీ, డోలపేట, సారధి ప్రాంతాల్లో ప్లాంట్లు ఏర్పాటు చేసి, పట్టణంలో ఉత్పన్నమయ్యే మురుగు నీటిని శుద్ధి చేసి పొలాలకు తరలించేందుకు అధికారులు ప్రణాళికలు, నివేదికలు సిద్ధం చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్లాంట్ల కోసం కేటాయించిన స్థలాలు మార్పు చేయడం, మున్సిపల్ అధికారులు కూడా అంతగా ప్లాంట్ల ఏర్పాటుపై ఆసక్తి చూపకపోవడం వంటి కారణాలతో ప్లాంట్ల ఏర్పాటు మూలకు చేరింది. అయితే సారధి గెడ్డలోకి మురుగునీరు తరలింపు విషయంపై మున్సిపల్ ఏఈ వెంకట్ వద్ద సాక్షి ప్రస్తావించగా, మురుగునీటి కాలువను సారధి గెడ్డకు అనుసంధానం చేసిన విషయం వాస్తవమేనని, కాలువ ద్వారా మురుగునీరు తప్ప, ప్రమాదకర వ్యర్థాలు కలవకుండా చర్యలు తీసుకుంటామన్నారు.


సారధి గెడ్డ ఇదే..


రాజాం పట్టణ వ్యర్థాలు తరలించేందుకు కొత్తగా నిర్మించిన భారీ కాలువ

చెరువుకు నష్టం కలిగితే ఊరుకోం..



సారధి గెడ్డ ద్వారా సిరిపురం తామరచెరువుకు సాగునీరు వస్తోంది. ఇప్పటివరకు ఈ కాలువ ద్వారా ఎటువంటి ఇబ్బందులు చెరువుకు రాలేదు. వేలాది మంది రైతులు ఈ చెరువు నీటిని సాగునీటిగా వాడుకుని పంటలు పండించుకుంటున్నారు. ఇలాంటి చెరువుకు నష్టం కలిగితే ఊరుకోం.. రాజాం పట్టణంలోని వ్యర్థాలు, విషపదార్థాలు, మురుగు అంతా చెరువుకు చేరితే ప్లానింగ్ ఇచ్చిన అధికారులపై పోరాటం తప్పదు.

– డోల తిరుపతి, సర్పంచ్, సిరిపురం గ్రామం

గతంలో పర్యాటక కేంద్రం చేయాలనుకుని..

సంతకవిటి మండలంలోని సిరిపురం తామర చెరువుకు మంచి పేరుంది. 599 ఎకరాల ఆయకట్టు కలిగిన ఈ చెరువును గతంలో టీడీపీ ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా చేసేందుకు ప్రయత్నించింది. చెరువు పరిసరాలను అత్యంత సుందరంగా తీర్చిదిద్ది, బోటింగ్ కూడా ఏర్పాటు చేయాలని ఇక్కడి టీడీపీ నాయకులు నేరుగా సీఎం చంద్రబాబును కలిసి కోరిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఇప్పుడు అదే చెరువుకు ముప్పు పొంచి ఉంది. రాజాంలో రోజురోజుకూ అధికమవుతున్న ప్లాస్టిక్, పాలిథిన్ వ్యర్థాలతో పాటు హోటళ్ల వ్యర్థాలు కాలువల్లో పడేస్తున్నారు. ఇవే వ్యర్థాలు సారధి గెడ్డలోకి వచ్చి చేరుతున్నాయి. ఈ క్రమంలో ఇదే గెడ్డ తామర చెరువుకు అనుసంధానించి ఉండడంతో చెరువు కలుషితమై, ఆ చెరువు ఆయకట్టులోని వేలాది ఎకరాల పంటపొలాలకు కలుషిత నీరు సాగునీరుగా సరఫరా అయి పంటలు పాడయ్యే ప్రమాదం ఉంది. అంతేకాకుండా ఇదే చెరువును ఆవాసంగా చేసుకుని జీవిస్తున్న చేపలు, కప్పలు వంటి జలచరజీవులు, బాతులు, ఇతర పక్షుల మనుగడ ఏమవుతుందనేది ప్రశ్నార్థంగా మిగిలింది. మండు వేసవిలో కూడా ఎంతోకొంత నీరు ఉండడం ఈ చెరువు ప్రత్యేకత. దీంతో పాటు ఈ చెరువుకు దక్షిణాన బ్రిటిష్ కాలం నాటి చప్టా నిర్మాణం కూడా ఉంది. అలాంటి గొప్ప చెరువు ఇప్పుడు ప్రమాదంలో పడిందన్న వార్త అక్కడి ప్రజలు, సాగునీటి కోసం చెరువు నీటిపై ఆధారపడిన రైతులను కలవరపాటుకు గురిచేస్తోంది. చెరువుకు మురుగునీరు, వ్యర్థాలు తరలిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరిస్తున్నారు.

ఫిబ్రవరి 3 నుంచి సదరం సర్టిఫికెట్ల పరిశీలన

రామభద్రపురం: దివ్యాంగులకు సంబంధించి, సదరం సర్టిఫికెట్లను ఫిబ్రవరి 3వ తేదీ నుంచి ఆస్పత్రుల్లో పరిశీలించడం జరుగుతుందని ఎంపీడీవో రత్నం తెలిపారు. ఇదే విషయమై ఆమె మండల కేంద్రంలోని తన కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. కళ్లకు సంబంధించి తనిఖీలు, సర్టిఫికెట్లను ఫిబ్రవరి 3, 4, 5, 10, 11 తేదీల్లో రాజాం ఏరియా ఆస్పత్రిలో వెరిఫికేషన్ చేస్తారని, పుట్టుకతో మానసిక అనారోగ్యం కలిగిన(మెంటల్) వారికి సంబంధించి తనిఖీలు మార్చి 25, 26 తేదీల్లో.. అప్పుడప్పుడూ మానసికంగా అనారోగ్యానికి గురవుతున్న వారికి సంబంధించి, ఏప్రిల్ 17వ తేదీన విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రిలో తనిఖీలు, సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్ ఉంటుందన్నారు. ఏయే వ్యక్తులు ఏయే తేదీల్లో హాజరు కావాలో తెలియజేస్తామన్నారు.

కొనసాగుతున్న రీవెరిఫికేషన్..

రాజాం: సదరం సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్ కొనసాగుతోంది. రాజాం, రేగిడి మండలాలకు చెందిన పలువురు దివ్యాంగులకు తనిఖీలు, వారి సదరం సర్టిఫికెట్ల పరిశీలనకు రాజాం ఏరియా ఆస్పత్రికి వారిని వారి కుటుంబ సభ్యులు తీసుకువచ్చారు.

'పొలం పిలుస్తోంది'

బొబ్బిలిరూరల్: మండలంలోని ఎం.బూర్జివలస, గున్నతోటవలస గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ శ్యామసుందర్.. వేరుశనగ పంటకు సోకే తెగుళ్లు, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.

వంగర: మండలంలోని మద్దువలస, అరసాడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో తట్టికోట కన్నబాబు మాట్లాడుతూ మొక్కజొన్న పంటను ఆశించే తెగుళ్ల నివారణపై రైతులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ముఖ్యంగా మొక్కజొన్న పంటను ఆశించే కత్తెరపురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోమేట్-100 మందును నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

రేగిడి: మండలంలోని దేవుదళ గ్రామ రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన రైతులకు ఏవో మురళీకృష్ణ పలు సూచనలు చేశారు. నీటివనరులు ఉన్నచోట ఆరుతడి పంటలు పండించుకోవాలని తెలిపారు.

గొప్ప వాగ్గేయకారుడు త్యాగరాజుస్వామి

రాజాం సిటీ: నాదోపాసన ద్వారా భగవంతుడిని తెలుసుకోవచ్చని నిరూపించిన గొప్ప వాగ్గేయకారుడు త్యాగరాజుస్వామి అని రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ కొనియాడారు. స్థానిక బొబ్బిలి రోడ్డులోని టీటీడీ కల్యాణ మండపంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో త్యాగరాజుస్వామి ఆరాధన మహోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. కర్ణాటక సంగీత త్రయంలో త్యాగరాజు ఒకరని, బాల్యం నుంచే ఆయన ఆలపించిన భక్తిగీతాలు శ్రీరాముడిపై అతనికున్న భక్తిని, వేదాలు, ఉపనిషత్తులపై ఉన్న జ్ఞానాన్ని తెలుపుతున్నాయన్నారు. తమిళ దేశంలో పుట్టినప్పటికీ ఆయన గానం తెలుగు, సంస్కృత భాషల్లో కొనసాగిందన్నారు. పంచరత్నసేవ, నాదస్వర కచేరీ, శాక్సాఫోన్ కచేరీ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దొంతకుర్తి త్రినాథరావు, నిర్మల దంపతులను సత్కరించారు. అంతకుముందు స్థానిక నవదుర్గమ్మ ఆలయం నుంచి త్యాగరాజు చిత్రపటంతో టీటీడీ కల్యాణ మండపం వరకు ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు పెంకి చైతన్యకుమార్, నాయీబ్రాహ్మణుల సంఘ అధ్యక్షులు సానాయిల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం మోడల్‌తో నిరంతర ఆదాయం


ఆకుకూర విత్తనాలు నాటుతున్న దృశ్యం

సంతకవిటి: ప్రకృతి సేద్యంలో ఏటీఎం మోడల్ ద్వారా కూరగాయలు, ఆకుకూరలు పండించడం వల్ల నిరంతర ఆదాయం వస్తుందని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ పాత్రుని వెంకటరమణ అన్నారు. మండలంలోని మామిడిపల్లి గ్రామంలో ఏటీఎం మోడల్ అనుసరించి, కూరగాయలు, ఆకుకూరలు ఏ విధంగా పండించి లాభాలు ఆర్జించవచ్చన్న అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఏటీఎం మోడల్ ప్రకారం 20 సెంట్ల భూమిలో తోటకూర, గోంగూర, కొత్తిమీర, పాలకూర, ముల్లంగి తదితర 12 రకాల ఆకుకూరల విత్తనాలను నాటారు. ఇలా నాటుకున్న వాటికి ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తయారు చేసుకునే ఘన, ద్రవజీవామృతాలు, నియమాత్రము వంటి గ్రోత్ ప్రమోటర్స్‌ను వాడడం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గి ఆదాయం బాగా వస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ సత్యవతి పాల్గొన్నారు.

హామీలు అమలు చేయలేనని అనడం దుర్మార్గం

బొబ్బిలి: ఎన్నికల సమయంలో ఎలాగైనా గెలవాలన్న ఆశతో ప్రజలకు లేనిపోని హామీలు ఇచ్చి, వాటిని ఇప్పుడు అమలు చేయలేనని సీఎం చంద్రబాబునాయుడు చెప్పడం(అనడం) దుర్మార్గమని ఉత్తరాంధ్ర సాధన సమితి వేమిరెడ్డి లక్ష్మునాయుడు అన్నారు. ఇదే విషయమై ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ తాను అంటే అభివృద్ధి, తనతోనే రాష్ట్ర అభివృద్ధి అని గొప్పలు పలికే చంద్రబాబు ఇటీవల దావోస్ పర్యటనకు వెళ్లి సాధించిందేమీ లేదని విమర్శించారు. అదే దావోస్ పర్యటనకు వెళ్లిన తెలంగాణ, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు రూ.లక్షల కోట్ల పెట్టుబడులు సాధించారన్నారు. ఇప్పుడు ఆయన ఇస్తానన్న సూపర్ సిక్స్ పథకాల హామీలు కూడా నెరవేర్చలేనని చెప్పడం.. ఆయనను నమ్మి ఓట్లు వేసిన జనాన్ని మోసం చేయడమేనన్నారు.

పక్కాగా మెనూ అమలు చేయాలి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మెనూ పక్కాగా అమలు చేయాలని ఎంఈవో జె.త్రినాధరావు సూచించారు. మండలంలోని పాములవలస, మాదంబట్లవలస గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఆయన మంగళవారం సందర్శించి, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, రికార్డులు, పిల్లల హోమ్‌వర్క్, చేతిరాత పుస్తకాలను పరిశీలించారు. అలాగే మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి సౌకర్యం, మధ్యాహ్న భోజన పథకం వంటకాలను తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యాప్రమాణాలు మరింత మెరుగుపరచాలని సిబ్బందికి తెలిపారు.

సోలార్ ప్యానెల్ వితరణ

బొబ్బిలిరూరల్: మండలంలోని సియోనువలస గిరిజన గ్రామానికి ఓ సోలార్ ప్యానల్‌తో పాటు 15 బల్బులను హ్యాండ్ ఇన్ హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ మంగళవారం వితరణ చేసింది. ఆ గ్రామానికి విద్యుత్ సదుపాయం లేకపోవడంతో రాత్రిపూట గ్రామస్తులు వీధుల్లో తిరుగాడే సమయంలో పాములు, విషపురుగుల కాటుకు గురై, ఆస్పత్రి పాలవుతున్నారన్న విషయం సదరు సంస్థ సభ్యులు తెలుసుకున్నారు. వారికి తమవంతు సాయం చేయాలని నిర్ణయించుకుని, సౌరశక్తిని విద్యుత్‌శక్తిగా మార్చే సోలార్ ప్యానల్‌ను అందజేశారు. ఈ మేరకు ఆ సంస్థ సభ్యులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎల్మార్, జయబాబు తదితరులు పాల్గొన్నారు.

• తక్షణమే బకాయి వేతనాలు చెల్లించాలి



గ్రీన్‌అంబాసిడర్ల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ మండల నాయకుడు ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన.. గ్రీన్‌అంబాసిడర్ల సంఘం మండల అధ్యక్షుడు ఆర్.రామారావు.. తెర్లాం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రేగి రాంబాబును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతినెలా సకాలంలో వేతనాలు అందకపోవడంతో గ్రీన్‌అంబాసిడర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 15వ ఆర్థికసంఘం నిధుల నుంచి పంచాయతీలు గ్రీన్‌అంబాసిడర్లకు వేతనాలు చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇచ్చిందని గుర్తు చేశారు. అయినా కొన్నాళ్లుగా వారికి వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. స్పందించిన ఎంపీడీవో.. గ్రీన్‌అంబాసిడర్ల వేతనాల కోసం ప్రభుత్వం ఎటువంటి నిధులు విడుదల చేయలేదని, వేతనాలు ఇవ్వాలని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు చెబుతామన్నారు. – తెర్లాం

• అండర్ పాస్ వే బ్రిడ్జి నిర్మించాలి



రామభద్రపురం మండలం, కొండకెంగువ దగ్గరున్న హెచ్‌జీ ఇన్‌ఫ్రా కంపెనీ గేటు ఎదుట గిరిజనులు మంగళవారం ఆందోళనకు దిగారు. రావివలస పంచాయతీ సమీపంలో కంపెనీ నిర్మాణం చేసిన ఆరు లైన్ల రహదారి వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. రహదారి కారణంగా గిరిజన గ్రామాల అనుసంధానం దెబ్బతిందని, జీలికవలస నుంచి జమ్మువలస పాఠశాలకు విద్యార్థులు వెళ్లాలంటే రోడ్డును అతికష్టం మీద దాటాల్సి వస్తోందన్నారు. అలాగే పెదశెలగాం గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా మూసుకుపోయిందన్నారు. జీసీసీ నుంచి రేషన్ సరుకులు కూడా తెచ్చుకునేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తోందన్నారు. అండర్ పాస్‌వే బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అదారి జైరావు తదితరులు పాల్గొన్నారు. – రామభద్రపురం

• వాటర్ ఫౌంటేన్ కాదు.. పైపులైన్ లీక్..



ఈ చిత్రంలో కనిపిస్తోంది.. వాటర్ ఫౌంటేన్ అనుకుంటే పొరపాటు పడినట్లే.. నిజానికి ఇది వంగర మండలం, మద్దువలస సమీపంలోని తాగునీటి పైప్ లైన్ లీకేజీ కారణంగా ఎగసిపడుతున్న వృథా నీరు. ఇదే పైపులైన్ ద్వారా వంగర మండలంలోని మద్దువలస, అరసాడ గ్రామాలతో పాటు రేగిడి మండలంలోని సరసనాపల్లి, జోడుబందల, కందిశ తదితర గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. తరచూ ఇటువంటి పైపులైన్ లీకేజీల ద్వారా ఆయా గ్రామాలకు తాగునీరు సక్రమంగా జరగడం లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు గమనించి, తాగునీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. – వంగర

సంక్షిప్తంగా..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

బొబ్బిలి: పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉన్న మోర్ మార్కెట్ ఎదురుగా ఆటోను ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రాజుపేటకు చెందిన జి రాము వ్యక్తిగత పనుల మీద ద్విచక్ర వాహనంపై పట్టణానికి వచ్చాడు. ప్రధాన రహదారిపై వెళ్తుండగా ముందుగా వెళ్తున్న ఆటోను ఢీకొనడంతో కిందపడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. రక్తమోడుతున్న అతనిని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ రియాజ్‌ఖాన్ సమీపంలో ఉన్న సామాజిక ఆస్పత్రికి మోసుకుని వెళ్లి చేర్పించగా క్షతగాత్రుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సకాలంలో ఆస్పత్రికి స్వయంగా తీసుకువెళ్లిన రియాజ్‌ఖాన్‌ను స్థానికులు అభినందించారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన

రాజాం: మండలంలోని గడిముడిదాం గ్రామంలో క్షయవ్యాధి నివారణపై మంగళవారం అవగాహన కల్పించారు. క్షయవ్యాధి నివారణ విభాగం డివిజినల్ సూపర్‌వైజర్ జి.లలిత, ఎంపీపీ లావేటి సులోచనలు వ్యాధి లక్షణాలు, దాని నివారణ చర్యలపై గ్రామస్తులకు సూచనలు చేశారు. వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా 100 రోజుల పాటు అవగాహన ర్యాలీలు, సదస్సులు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

విద్యాప్రమాణాలు మెరుగుపరచాలి

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని బొడ్డవలస, సంకిలి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన మంగళవారం సందర్శించి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించి, పలు సూచనలు చేశారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై దృష్టి సారించాలని తెలిపారు.

సన్మానం

బొబ్బిలి: పట్టణ ఏఎస్ఐగా పనిచేసి, బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్తున్న జి.భాస్కరరావును స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం రాత్రి సన్మానించారు. సీఐ కె.సతీష్‌కుమార్, ఎస్ఐ ఆర్.రమేష్ తదితరులు ఏఎస్ఐ సేవలను ప్రశంసించారు.

స్టడీ మెటీరియల్ వితరణ

బొబ్బిలిరూరల్: మండలంలోని మెట్టవలస గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు స్పందన అనే స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కాజా వేణుగోపాలరావు స్టడీ మెటీరియల్‌ను మంగళవారం వితరణ చేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కుల సాధనకు ఈ మెటీరియల్ దోహదపడుతుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధవరావు, ప్రధానోపాధ్యాయురాలు విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

మార్చి 9 నుంచి పోలిపల్లి పైడితల్లి జాతర

రాజాం సిటీ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, స్థానిక బొబ్బిలి రోడ్డులో కొలువైన పోలిపల్లి పైడితల్లి 99వ జాతర మహోత్సవం మార్చి 9వ తేదీ నుంచి నిర్వహించనున్నామని ఆలయ ఈవో బీవీ మాధవరావు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. మూడు రోజుల పాటు జాతర ఉంటుందని, ఫిబ్రవరి 5న ముహూర్తపు రాట ఆలయ ఆవరణలో వేయనున్నామన్నారు. అప్పటి నుంచి అధికారికంగా జాతర పనులు ప్రారంభిస్తామన్నారు.

అగ్నిఅస్త్రం తయారీపై అవగాహన

వంగర: మండలంలోని కింజంగి గ్రామంలో అగ్నిఅస్త్రం తయారీపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ ఆరిప్పల్లి సింహాద్రినాయుడు తొలుత అగ్నిఅస్త్రం తయారీని ప్రయోగాత్మకంగా వివరించి, చూపించి దాని ప్రయోజనాలు వివరించారు. మొక్కజొన్న పంటను ఆశించే కత్తెరపురుగు నివారణకు ఈ అగ్నిఅస్త్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

పశువైద్య శిబిరాలు

బాడంగి/తెర్లాం/బొబ్బిలిరూరల్/రేగిడి: మండలాల్లోని పలు గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు మంగళవారం నిర్వహించారు. పాడిరైతులు, పశుపోషకులంతా శిబిరానికి తీసుకువచ్చిన మూగజీవాలకు వైద్య సిబ్బంది తనిఖీలు నిర్వహించి, వ్యాధి బారినపడకుండా మందులు, టీకాలు వేశారు. అనంతరం ఆరోగ్యానికి పలు సూచనలు చేశారు.

• అధిక లోడు.. ప్రమాదం చూడు!





పరిమితికి మించి అధిక లోడుతో ప్రమాదకరంగా పలు వాహనాలు నడుపుతున్న దృశ్యాలు.. రామభద్రపురం మండల కేంద్రం మీదుగా జాతీయ రహదారిపై మంగళవారం కనిపించాయి. ఇలాంటి వాహనాల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నా.. అవేమీ తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు కొంతమంది వాహనదారులు. ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి వాహనాలు, వాహనదారులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతోనే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. అధిక లోడు వాహనాల కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు సహా అవతలి నుంచి వచ్చే వాహనం కనబడడం లేదని తద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. – రామభద్రపురం